క్లుప్తంగా

ఆదాల గెలుపు తథ్యం



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు తథ్యమని ఆ పార్టీ నాయకుడు కల్లూరు లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనితారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

• సీఐ రవినాయక్



సంగం : సంగం సర్కిల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ రవి నాయక్ తెలిపారు. సంగంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదన్నారు. పోలింగ్ సిబ్బందికి, పోలీసులకు ఓటర్లు సహకరించాలని కోరారు. స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అటవీ సిబ్బందిపై దాడి

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి అటవీ శాఖ చెక్‌పోస్ట్‌లో విధుల్లో ఉన్న సిబ్బందిపై కొందరు వ్యక్తులు పాల్పడిన ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నాగులవెలటూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో రాగా అటవీ శాఖ సిబ్బంది గేటు తీయడంలో ఆలస్యమైంది. దీంతో ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి సిబ్బందిపై దాడి చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందింది.

20 నుంచి సత్యనారాయణుని బ్రహ్మోత్సవాలు



కావలి: పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు మామిడి రామకృష్ణ తదితరులు శనివారం అందజేశారు.

పోలీసు పహారాలో మద్యం అమ్మకాలు



సీతారామపురం: ఎన్నికల నేపథ్యంలో వరుసగా ఆది, సోమవారాల్లో మద్యం దుకాణాలు మూతపడనుండడంతో మందుబాబులు పెద్ద ఎత్తున మద్యం కోసం శనివారం ఎగబడ్డారు. ఉదయాన్నే సీతారామపురంలోని మద్యం దుకాణం వద్దకు చేరుకుని గంటల తరబడి నిరీక్షించారు. తెరిచిన వెంటనే మద్యం కోసం ఎగబడ్డారు. ఈ క్రమంలో సిబ్బందితో కొందరు వాగ్వాదానికి దిగడంతో ఎస్సై అనూష బారికేడ్లు ఏర్పాటు చేయించి అమ్మకాలు సజావుగా జరిగేలా చూశారు. మధ్యాహ్న సమయానికే స్టాక్ పూర్తికావడంతో దుకాణాన్ని మూసివేశారు.

ఎన్నికల ప్రచారానికి తెర



చివరి రోజు ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. కొద్దిరోజులుగా హోరెత్తించిన మైకులు శనివారం సాయంత్రం 6 గంటలతో మూగబోయాయి. ఈ నెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 48 గంటల ముందే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారాలను ఆపేశారు. మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. 13న పోలింగ్ పూర్తయిన తర్వాతే దుకాణాలను తెరుస్తారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. నిర్దేశిత సమయంలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ప్రతిఒక్కరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. గత రెండ్రోజుల నుంచి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కొంత మేర ప్రచారాన్ని తగ్గించి తెరచాటు రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నారు.

వైఎస్సార్‌సీపీని ఓటుతో ఆశీర్వదించండి





రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్న ప్రజలు

- ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: పేద బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెత్తందారుల ప్రతినిధిగా చంద్రబాబునాయుడు ప్రజల ముందుకువస్తున్నారని, పేదల ప్రతినిధి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ఓటుతో ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కోరారు. శనివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని డైకస్ రోడ్డులో ఉన్న దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి జరిగిన రోడ్‌షోలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం అహర్నిశలు పనిచేసి పేదరికం నిర్మూలనకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద, బడుగు, బలహీన వర్గాలు అండగా నిలవాలని కోరారు. నయవంచకుడు, దోపిడీదారుడు, పక్షపాత ధోరణితో వ్యవహరించే వ్యక్తి, కులపిచ్చి కలిగిన వ్యక్తి అయిన చంద్రబాబు అవలక్షణాలకు ప్రతిరూపమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథి అని, నిరంతర శ్రామికుడని పేర్కొన్నారు. టీడీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత పదేళ్లుగా భూకబ్జాలు, రౌడీయిజం చేయడంతోపాటు అధికారులకు బెదిరింపులకు గురిచేశారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమాలను ఎన్నికల తరువాత వెలికితీసి ఆయనపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన రౌడీయిజాన్ని ఇంటికే పరిమితం చేసుకోవాలని, బయట చూపిస్తే సహించేది లేదని సవాల్ విసిరారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్‌లు అరాచకాలకు రాబోయే ప్రభుత్వంలో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరిస్తామని తెలిపారు.

జగన్ అంటే సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెబితే కరువు కాటకాలు మాత్రమే గుర్తుకు వస్తాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే సంక్షేమం, అభివృద్ధి గుర్తుకువస్తాయని తెలిపారు. కరువు కాటకాలు కావాలో.. సంక్షేమం, అభివృద్ధి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పోరాడారని తెలిపారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి వైఎస్సార్‌సీపీలో ఎన్నో పదవులు అనుభవించి కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచి ప్రత్యర్థులతో చేతులు కలిపారని దుయ్యబట్టారు. వీరిద్దరి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించి ఓటు వేయాలని కోరారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, అంతకుముందు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన అరాచకాలతో పోల్చి చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

• ఆదాల హిమబిందు



ఆదాల హిమబిందును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లూరు సిటీ: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదాల హిమబిందు కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్ వనంతోపు సెంటర్ సమీపంలో సంజీవ్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని, సోమవారం జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంజీవ్ హోమ్స్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహారావు, సెక్రటరీ వాసంతి, అసోసియేషన్ నాయకులు రమేష్, యువ నాయకులు కొండ్రెడ్డి భరత్‌కుమార్, ఏపీ స్టేట్ ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, టీఎల్ఎఫ్ అధ్యక్షుడు హరితారెడ్డి, భార్గవిరెడ్డి, నాయకుడు పాశం వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ

• ఎన్‌జీఓ టి.కల్పనారెడ్డి



ఎన్నికల ప్రచారంలో కల్పనారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని కల్పనారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ టి.కల్పనారెడ్డి పేర్కొన్నారు. నగరంలో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఆమె శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం గత 20 రోజులుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించామని, ప్రతిచోటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు బూటకపు మేనిఫెస్టోతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు వచ్చారని, ఆయనకు ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమన్నారు.

కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు, సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు నగర అభ్యర్థిగా ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ తాతిరెడ్డి, సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్వో రాజారమేష్‌ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్ రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలతో ముగిసిందని చెప్పారు. పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సోమవారం పోలింగ్ సందర్భంగా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల పరిధిలో ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతిఒక్క రూ పాటించాలన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీవర్లను స్థానికులను మాత్రమే నియమించుకోవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని చెప్పారు. గుర్తింపు కార్డులు ఉంటేనే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు.

సమస్యాత్మక కేంద్రాలు ఇవే..

ఉదయగిరి నియోజకవర్గంలో 323 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 48 కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు ఆర్వో తెలిపారు. అందులో సీతారామపురం మండలం దేవమ్మచెరువు, బసినేనిపల్లి, ఉదయగిరి మండలం బిజ్జంపల్లి, ఉదయగిరిలోని 45, 47, గానుగపెంటపల్లి, వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి, తిమ్మారెడ్డిపల్లి, రామాపురం, గణేశ్వరపురం, దుత్తలూరు మండలం దుత్తలూరులోని ఆరు పోలింగ్ కేంద్రాలు, బోడవారిపల్లి, నర్రవాడ, ఏరుకొల్లు, నందిపాడు, వింజమూరు మండలం గోళ్లవారిపల్లి, వింజమూరులోని 161, 162, 163, 154, కొండాపురం మండలం వెలిగండ్ల, గుడవళ్లూరు, బీమవరప్పాడు, పెద్ద అన్నలూరు, జలదంకి మండలం అన్నవరం, చామదల, బ్రాహ్మణక్రాక, బీకేఅగ్రహారం పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

ఆదిశంకరుల జయంతి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాల వారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి జరగనుందని ఆ ట్రస్ట్ మేనేజర్ సీవీఎల్ నరసింహం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అష్టావధాని కోట రాజశేఖర్ 'సౌందర్య లహరి సాహిత్య విశ్లేషణ' ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిశంకరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు 'భాష్య సూత్ర ప్రవచన సప్తాహం' ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలకు వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఆదిశంకరుల కృపకుపాత్రులు కావాలని కోరారు.

నగదు, మద్యం సీజ్

నెల్లూరు(క్రైమ్): ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని పోలీసు, సెబ్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు నవాబుపేట పరిధిలో రూ.1,38,500, దర్గామిట్టలో రూ.29 వేల నగదును సీజ్ చేశారు. బాలాజీనగర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.16,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలసత్రం పరిధిలో 11, ఉదయగిరిలో 10, దుత్తలూరులో 14, సెబ్ ఆధ్వర్యంలో 310 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. దుత్తలూరులో 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

వాహనాల ఢీ



సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో బుల్లితెర నటి పవిత్రకు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాతాళపల్లి- చిలకలమర్రి జాతీయ రహదారి మధ్యలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. తిరుపతి నుంచి వస్తున్న కారు సోమశిలకు వెళ్తున్న బుల్లితెర నటి పవిత్ర కారు ఢీకొన్నాయి. రెండు వాహనాల ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. అయితే వాహనంలో ఉన్న ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు.

మురళీకృష్ణకు జ్యోతిష్యకేసరి అవార్డు



ముత్తుకూరు : హైదరాబాద్ పరాశరా అకాడమి ఆఫ్ ఆస్ట్రో సైన్స్ వారు ముత్తుకూరుకు చెందిన జీవీబీ మురళీకృష్ణకు జ్యోతిష్యకేసరి అవార్డును శనివారం అందజేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ మేరకు ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది జ్యోతిష్యులు హాజరయ్యారు.

పోలింగ్ నిర్వహణకు తోడ్పడండి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

• జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జిల్లా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అనుమతి లేకుండా వాహనాలను వినియోగించకూడదన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుందని, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే రాజకీయ పార్టీల ఏజెంట్లు ఉదయం 5.30 గంటలకు అందుబాటులో ఉండాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని, ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఏవైనా ఉంటే సీ విజిల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ వివిధ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తాము తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. అల్లర్లు, గొడవలకు తావులేకుండా సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా డయల్ 112కు, స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ డే విధివిధానాలను పాటించాలి



ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ డే విధివిధానాలను రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరఫున వచ్చిన ప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. పోలింగ్ డే విధివిధానాలపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరఫున వచ్చిన ప్రతినిధులతో ఆయన శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రం వద్ద పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల అనుమతులు, అభ్యర్థి వాహనం, ఏజెంట్ వాహనం పట్ల వారికున్న వివిధ సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేయడం వరకే అభ్యర్థులకు పరిమితి ఉందని, మౌఖిక ప్రచారం చేయడానికి అనుమతులు లేవని ఆర్‌ఓ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని, మంజూరు చేసిన ఐడీ కార్డులను అభ్యర్థులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

సకాలంలో టీకాలు వేయాలి



ఏసీ నగర్ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య

పొదలకూరు : గ్రామాల్లోని పిల్లలకు ఆరోగ్య సిబ్బంది సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, పట్టణంలోని ఏసీనగర్ కాలనీలో శనివారం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సలహాలు, సూచనలు చేస్తూ అవసరమైన వారికి వైద్య సేవలు అందించాల్సిందిగా సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట డాక్టర్ కిరణ్‌రిషిత, డాక్టర్ శ్రీకావ్య, ఆరోగ్య సహాయకురాలు కామాక్షమ్మ తదితరులు ఉన్నారు.

వలస ఓటర్లపై వల

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ విజయం కోసం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచండ ఎండను సైతం లెక్కచేయకుండా శ్రమపడ్డారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రతి ఓటును కీలకంగా అభ్యర్థులు భావిస్తున్నారు. ప్రతి ఓటును తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఎంత ఖర్చు అయినా చేసేందుకు వెనుకాడడం లేదు. ఏ ఒక్క ఓటు కూడా ప్రత్యర్థికి వెళ్లకుండా ఎరవేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి పెడుతున్నారు. వారిని ఆకర్షించేందుకు నగదుతో పాటు ప్రయాణ చార్జీలు ఇస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 25 వేల నుంచి 30 వేల వరకు వలస ఓటర్లు ఉన్నారు. వీరంతా ఎక్కువగా తెలంగాణలోని ఆర్మూరు, నిజామాబాద్, కామారెడ్డి, కోరుట్లతో పాటు బెంగళూరులో ఉంటున్నారు. వలస ఓటర్లు గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు వారిపై దృష్టి సారించారు. తమకు అనుకూలంగా ఓట్లు పడతాయనుకున్న వారి జాబితాలను తయారుచేసి గ్రామస్థాయి నేతల ద్వారా వలస ఓటర్ల ఖాతాల్లోకి నగదుతో పాటు చార్జీలు జమచేస్తున్నారు. వారు ఎక్కువగా ఉన్న బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఆర్మూరు, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై కేవలం 3,400 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వలస ఓటర్లను భారీ సంఖ్యలో రప్పించుకోవడం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎక్కువ మెజార్టీతో గెలుస్తామన్న ధీమాతో వారిని తీసుకురాకపోవడంతో ఓటమిపాలయ్యారు. ఈ దఫా ఎన్నికలు నువ్వా..నేనా అన్నట్లుగా సాగుతుండడంతో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి రప్పిస్తున్నాయి.